ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 22 జూలై 2025

రాజన్నకు భక్తుల మొక్కులు

- సందడిగా మారిన ఆలయం



రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి.. 7

ప్రాణాలు పోతున్నా పట్టింపేది..?


- డేంజర్ జోన్‌గా అరెపల్లి-నందికమాన్ రోడ్డు



అనుపరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు 6

'భూభారతి'.. కరుణించవా..!

- 'ధరణి'తో పరిష్కారం కాని సమస్యలు
- పదేళ్లుగా సాదాబైనామాలపై నిరీక్షణ
- జిల్లాలో 15 వేల పాత దరఖాస్తులు
- తాజాగా రెవెన్యూ సదస్సుల్లో 1,675 కొత్త అర్జీలు..



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

'భూభారతి' సాదాబైనామాలపై ఎప్పుడు కరుణిస్తుందోనని దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'ధరణి' భూసమస్యలకు పరిష్కారం చూపకపోగా, పట్టాదారులకు కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతిని తీసుకురావడంతో భూ సమస్యలు తీరుతాయని రైతులు మళ్లీ ఆశగా ఎదురుచూస్తున్నారు. భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై మళ్లీ దరఖాస్తులు తీసుకున్నారు. భూభారతి సదస్సులో అసైన్డ్ భూముల సమస్యలతో పాటు సాదాబైనామాలపైన ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. రాజన్నసిరిసిల్ల జిల్లావ్యాప్తంగా 6,787 దరఖాస్తులు రెవెన్యూ సదస్సులో వచ్చాయి. వీటిలో సాదాబైనామా దరఖాస్తులు 1675 వచ్చాయి. దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో ప్రధానంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యల్లో దాదాపు 10ఏళ్లుగా ఇబ్బంది పెడుతున్న సమస్య సాదాబైనామాలు ప్రధానంగాఉన్నాయి. సాదాబైనామాలు పరిష్కారం పేరిట గత ప్రభుత్వం 2016లోజీవో నంబర్ 153తీసుకువచ్చింది. 2014జూన్ 2వతేదీ ముందు సాదా బైనామాలు భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చట్టబద్ధత కల్పించాలని భావించారు. ఇందుకోసం 2020 అక్టోబరు 12నజీవో నంబర్ 112జారీ చేసింది. దీనికి సంబంధించి మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. సాదా బైనామాలపై తహసీల్దార్‌లకు అధికారాలు ఇచ్చినా మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో సమస్యలు పరిష్కారం కాలేదు. దీంతో పదేళ్ల నిరీక్షణకు తెరపడలేదు.

భూభారతిపై ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఆర్‌వోఆర్ 2020-25 భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. భూభారతిపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. భూభారతిలో సాదా బైనామాలు సమస్యలు పరిష్కారం అవుతాయని దరఖాస్తుదారులు ఆశలు ఏర్పడ్డాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న భూరికార్డుల నిర్వహణ, పద్ధతులను పరిశీలించిన అనంతరం వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి వేర్వేరు రికార్డులు చేయడానికి ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. భూ రికార్డులు మెరుగ్గా ఉండే విధంగా రైతు సంఘాలు మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు ప్రజాప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని భూభారతి కొత్త చట్టాన్ని తీసుకవచ్చారు. పకడ్బందీగా భూభారతిలో డేటాను అప్‌లోడ్ చేశారు. 33 నుంచి 6 మాడ్యూల్‌లకు పరిమితం చేశారు. భూమిత్రలో సందేహాలను నివృత్తి చేసే విధంగా చాట్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఏ సందేహం అయినా తీర్చుకునే వీలు కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహకారంతో ఈ చాట్‌బోర్డు పనిచేసేలా డిజైన్ చేశారు. ధరణి పోర్టల్‌లో వివరాల నమోదు, ఓటీపీ నమోదు వరకు 30సెకండ్లు అవుతుండగా, దీనినే నాలుగు సెకండ్లలోనే వివరాలు అందించేలా స్పీడ్ పెంచారు. 33 మాడ్యూల్‌లోల కొన్నింటిని అనుసంధానం చేయగా 5, 6 మాడ్యుల్‌లను పూర్తిగా తొలగించారు. 18, 19 మాడ్యూళ్లను కలిపి ఆరుగా మార్చారు. రైట్ టు ప్రైవసీ చెక్‌ను తొలగించారు. గతంలో ధరణి పోర్టల్‌లో కొందరు తమ భూముల వివరాలను గోప్యంగా ఉంచుకునేందుకు వెసులుబాటు కల్పించిన ప్రైవసీచెక్‌ను పూర్తిగా ఎత్తివేశారు. ప్రతి ఎకరంభూమి వివరాలు ఉండే విధంగా ఏర్పాటు చేశారు. సరళమైన భాషలో జనానికి అర్థమయ్యే విధంగా అంశాలను పొందుపర్చారు.

జిల్లాలో 15వేల పాత సాదాబైనామాలు..

సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించి క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా అచరణలోకి రాలేదు. గత ప్రభుత్వం నిర్ణయించి దరఖాస్తులు తీసుకున్నా ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లకాగితం ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ భూభారతి బిల్లు-2024ద్వారా సాదాబైనామాలతో క్రమబద్ధీకరణకు భూ భారతి పోర్టల్ ద్వారా రైతులందరికి పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలని నిర్ణయించారు. గతప్రభుత్వం 2020 సంవత్సరం నవంబరు వరకు సాదాబైనామాల దరఖాస్తులను స్వీకరించింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 15వేలమంది దరఖాస్తులు చేసుకున్నారు. మీ సేవా ద్వారా చేసుకున్న ...

- మిగతా 8లో

శాకంబరి అలంకారంలో సరస్వతి మాతా..

ఎల్లారెడ్డిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని మడేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని సరస్వతి మాతను రకరకాల కూరగాయలతో అలంకరించారు. శాకంబరి అవతారంలో సరస్వతి మాతా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు భక్తిశ్రద్ధలతో చదువులతల్లిని కొలిచారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

ఎల్లారెడ్డిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి చెందిన రేవంత్‌రెడ్డి మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి ఉత్తమ సామాజిక మాధ్యమ ప్రభావితుడి అవార్డును సోమవారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని కళారాజ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన టీఎస్‌ఎఫ్‌ఏ సోషల్ మీడియా ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో విజయ్‌రెడ్డికి అవార్డును అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- ప్రభుత్వ విప్‌కు డీటీఎఫ్ నాయకుల వినతి



ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీటీఎఫ్ నాయకులు

వేములవాడ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతపత్రం అందజేశారు. జిల్లాలో ఇటీవల జరిగిన వర్క్ అడ్జస్టమెంట్ గత నెలలో ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రకారం చేశారని, దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందికి గురవుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుత విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని కోరారు. జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్స్ వర్కింగ్ పర్సన్స్‌కు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వారి వేతనాలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఆవురం సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి వంగ తిరుపతి, స్టేట్ కౌన్సిలర్లు దొంతుల శ్రీహరి ఉపాధ్యాయ సంఘం నాయకులు రఘుపతిరావు, శ్రీనివాస్, పరుశరాములు, దశరథం, మహేష్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మల్లేశం, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

మొరం, ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు

సిరిసిల్ల టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు ప్రతిరోజు మొరం, ఇసుక అనుమతి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో ఏఐటీయూసీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో రాములు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో సైతం మొరం, ఇసుక తీసుకోవడానికి ప్రభుత్వం అధికారులు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మొరం ఇసుక, బండలు, కంకర తీసుకొస్తున్న ట్రాక్టర్లను మైనింగ్, పోలీసుల అధికారులు పట్టుకొని సీజ్ చేస్తూ కేసుల వేయడం సబబుకాదన్నారు. ఈ చర్యల వల్ల ట్రాక్టర్ యజమానులు విపరీతంగా ధరలను పెంచుతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. లబ్ధిదారలకు ఆర్థికంగా ఇబ్బందుల లేకుండా ఇందిరమ్మ ఇళ్ల మెటీరియల్ ధరలను ప్రభుత్వం నియంత్రించాలని ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకుడు క్రాంతి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలు ఏకంకావాలి



భీమ్ ఆర్మీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

వేములవాడ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల యువత ఏకంకావాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ అన్నారు. వేములవాడ పట్టణంలోని భీమ్ ఆర్మీ ఆవిర్భావ వేడులను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమ్ ఆర్మీ పది సంవత్సరాల క్రితం ఉత్తరాది రాష్ట్రాల్లో అగ్రవర్ణ కులాల వారు దళిత సమాజంపై చేస్తున్న ఆధిపత్య ఆగడాలకు వ్యతిరేకంగా ఆనాటి యువ న్యాయ విద్యార్థులైన చంద్రశేఖర ఆజాద్, వినయ్ రతన్ సింగ్, సతీష్ కుమార్‌లు కలిసి 2015 జూలై 21న ఏర్పాటు చేశారని చెప్పారు. దేశంలో అట్టడుగు వర్గాలను, బడుగు, బలహీన వర్గాలను ఏకం చేసి వారికి జరిగే అన్యాయాలపై పోరాటాలకు సిద్ధమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్, వినయ్, రాజు, ప్రశాంత్, నాగరాజు, గోపి, విజయ్, సతీష్, మధు, అరుణ్, సురేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు..

- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో జాగ్రత్తలను చేపట్టాలని, అలాగే పంటలసాగుకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు చేపట్టడంతోపాటు రేషన్‌కార్డులను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో సమీక్షించారు. జూలై 25నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు మండల కేంద్రాల్లో రేషన్ కార్డులను పంపిణీ చేయాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వ్యవసాయ పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే నీటిపారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు అందించాలన్నారు. జిల్లాలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలన్నారు. ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలని కోరారు. అత్యవసర సమయంలో కలెక్టర్ ఖర్చు చేసేందుకు నిధులు కూడా అందుబాటులో పెట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎరువుల స్టాక్ ఎంత అందుబాటులో ఉందో కలెక్టర్ రెగ్యూలర్‌గా ప్రకటనలు విడుదల చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పాల్గొనేలా కలెక్టర్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలన్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేయాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల మండలాల చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని ఆర్డీవోలను కలెక్టర్ సందీప్‌కుమర్ ఝా ఆదేశించారు. ముస్తాబాద్-సిద్దిపేట, గంభీరావుపేటప కామారెడ్డి, రుద్రంగి, కోరుట్ల బోయిన్‌పల్లి, కరీంనగర్ మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్ల మరమ్మతుకు అవసరమైన మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఈఈలను ఆదేశించారు. ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, పౌరసరఫరాల శాఖ డీఎం రజిత, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిషోర్, సీపీవో శ్రీనివాసచారి, అర్‌అండ్‌బీ ఈఈ వెంకటరమణయ్య, పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, డీసీహెచ్ డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - చంద్రంపేటలో నూతన కార్డుల పంపిణీ



రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న కలెక్టర్, నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలందరికి నూతన రేషన్‌కార్డుల పంపిణీ నిరంతరం కొనసాగుతుందని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటలోని జిల్లా రైతు వేదికలో సోమవారం పలు వార్డులకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో అర్హులైన 2610 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నమన్నారు. అలాగే ఇప్పటికే ఉన్న కార్డుల్లో మొత్తం 4527 మందిని అదనంగా చేర్చడం జరిగిందన్నారు. సిరిసిల్ల మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 21వేల రేషన్ కార్డుల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తామన్నారు. రేషన్‌కార్డు చాలా కీలకమైన డ్యాకుమెంట్ అని, అధార్‌కార్డు, కరేంట్ కనెక్షన్, ప్రభుత్వ పథకాలు అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్‌కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, గుర్తింపు కోసం కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో నూతనంగా 14వేల లబ్ధిదారులకు రేషన్ అందించేందుకు కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి లబ్ధిదారుడు నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. నూతన రేషన్ కార్డుల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందన్నారు. రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకా కార్డులు రానివారు ఉంటే మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూప తిరుపతిరెడ్డి, సిరిసిల్ల అర్డీవో వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజిత, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులు గడ్డం నర్సయ్య, వెల్మల తిరుపతిరెడ్డి, భీమవరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా విగ్రహ నిర్మాణం

- నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



గంభీరావుపేటలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని రాజకీయాలకు అతీతంగా నిర్మించుకుందామని నాఫ్స్‌కాప్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పిలుపునిచ్చారు. గంభీరావుపేట బీఆర్‌ఎస్ మండల పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడారు. గంభీరావుపేటలో జయశంకర్ విగ్రహ పిల్లర్‌ను కూల్చివేయడం బాధాకరమన్నారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన మహనీయుడి విగ్రహ నిర్మాణంలో రాజకీయాలు చోటు చేసుకోవడం నిజంగా చాలా విచారకరమన్నారు. విశ్వబ్రాహ్మణులు జయశంకర్ విగ్రహ నిర్మాణంలో భాగంగా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారని, అందుకు అధికారులు మౌకికంగా అనుమతులు ఇచ్చి, అధికారికంగా అనుమతుల కోసం అవకాశం ఇవ్వకుండా విగ్రహ పిల్లర్‌ను కూల్చి వేయించారని ఆరోపించారు. మహనీయుడి విగ్రహ నిర్మాణాన్ని వివాదాస్పదం చేసి, తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్‌ను అవమానించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అధికారులు, రాజకీయ నాయకులు అనుభవిస్తున్న పదవులు జయశంకర్ కృషి ఫలితమేనని అన్నారు. ఇప్పటికైనా రాజకీయాలను పక్కనబెట్టి ముందుగా అనుకున్న రోజునే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకుందామని వెల్లడించారు. విశ్వబ్రాహ్మణులు మంచి ఆలోచనతో మహనీయుడి విగ్రహాన్ని నిర్మించడం కోసం ముందుకు రావడం శుభసూచకమన్నారు. వారికి బీఆర్‌ఎస్ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ విగ్రహ నిర్మాణంలో తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, కొత్తపల్లి సింగిల్‌విండో చెర్మన్ సురేందర్, పట్టణ అధ్యక్షుడు పెద్దవేని వెంకటి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, నాయకులు సురేందర్, లక్ష్మణ్, లింగమ్‌యాదవ్, రాజిరెడ్డి, మల్లేశం, శేఖర్‌గౌడ్, చారీ, వహీద్, కమలాకర్‌రెడ్డి, శంకర్ ఉన్నారు.

మంత్రిని కలిసిన సెస్ డైరెక్టర్

బోయినపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను బోయినపల్లి సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ కలిశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి పర్యటనకు సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసి రాజన్న తీర్థప్రసాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం కార్యవర్గం ఏకగ్రీవం అయింది. ఐదు వార్డుల డైరెక్టర్ల స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి. సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి కల్యాణ భవనంలో ఎన్నికల అధికారి భూపతి ఆధ్వర్యంలో అభ్యర్థుల నామినేషన్ల స్క్రూటినీలు జరిగాయి. అనంతరం మధ్యాహ్నం అభ్యర్థుల బుజగింపులతో ఉపసంహరణలు జరిగాయి. సాయంత్రం ఎన్నికల అధికారి భూపతి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణలో అధ్యక్ష పదవికి దూడం శంకర్, ఉపాధ్యక్షులు గాజుల బాలయ్య, మోర రవి, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, కోశాధికారి యెల్లె శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కోడం శ్రీనివాస్‌లో మాత్రమే బరిలో ఉండడంతో ఏకగ్రీవం అయిందన్నారు. 39 వార్డులకు డైరెక్టర్ల పదవులకు మొత్తం 44 నామినేషన్లు వచ్చాయని అందులో నుంచి ఆరు ఉపసంహరణ జరగగా, 28 వార్డుల డైరెక్టర్లు ఏకగ్రీవమైందని అన్నారు. మరో ఆరు వార్డులో నామినేషన్లు వేయ లేదన్నారు. ఐదు వార్డులో అభ్యర్థుల మధ్య పోటీ ఉందని పేర్కొన్నారు.

ఈ నెల 27న ఎన్నికల అనంతరం అధికారికంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తారని పేర్కొన్నారు.

గేదె పొడిచి ఒకరి మృతి

వేములవాడ రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై గేదె దాడి చేయడంతో తీవ్ర గాయలపాలై మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాంపల్లి గ్రామానికి చెందిన కర్ర అనంతరెడ్డి (65) ఆదివారం రాత్రి పనులు ముగించుకుని తన ఇంటికి చేరుకున్నాడు. గేదె మెడకు తాడు కట్టే సమయంలో ఒక్కసారిగా కొమ్ములతో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక వైద్యులను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అనంతరెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

గీత కార్మికుడి ఆత్మహత్య

ఓదెల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఐలు శ్రీనివాస్ గౌడ్(48) అనే గీత కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ గౌడ్ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవితేజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కిషన్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, జూలై 21(ఆంధ్రజ్యోతి): నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన మహ్మద్ షబ్బీర్(19)అనే యువకుడు సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. పనిదొరకకపోవడంతో మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పదో తరగతిలో ఏఐ పాఠాలు



- మద్రాస్ ఐఐటీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ శిక్షణ
- ఎన్‌రోల్‌మెంట్‌కు ఈ నెల 25 వరకు గడువు
- ఏడాదిలో మూడు బ్యాచ్‌లకు అవకాశం

హుజూరాబాద్‌రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఐఐటీలు అందించే వివిధ కోర్సులపై స్కూల్ దశ నుంచే అవగాహన కల్పించాలని మద్రాస్ ఐఐటీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కొత్త అంశాలు నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏఐతో పాటు ఎలక్ర్టానిక్స్, కంప్యూటర్స్, డాటా సైన్స్ లాంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరంలో మూడు బ్యాచ్‌లకు ఐఐటీలో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

మొదటి బ్యాచ్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ చివరి తేదీగా నిర్ణయించారు. ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభం కానున్నాయి. స్కూల్ కనెక్ట్ పేరుతో ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో 10 కోర్సులకు శిక్షణ ఇచ్చేందుకు మద్రాస్ విద్యాలయం ఏర్పాట్లు చేసింది. హుజూరాబాద్ మండలంలోని 13 ఉన్నత పాఠశాలతో పాటు గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో శిక్షణ ఇవ్వనున్నారు.

● కోర్సులు ఇవే

డాటా సైన్స్, ఏఐ, ఎలక్ర్టానిక్స్ సిస్టమ్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, ఫన్‌విత్ మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, మ్యాథ్స్ అన్‌ప్లగ్‌డ్ గేమ్స్ అండ్ పజిల్స్, పర్యావరణం, ఇంజనీరింగ్ బయోలాజికల్ సిస్టమ్, లా, ఏరోస్పేస్ (ప్రాథమిక అంశాలు), హ్యూమానిటీస్ తదితర కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు.

చాలా మంచి అవకాశం..

చరణ్, పదో తరగతి, చెల్పూర్



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఐఐటీ శిక్షణ ఇవ్వటం చాలా మంచి అవకాశం. నేను కూడా నేర్చు కోవాలనుకుంటున్నాను. బయట రూ. వేలల్లో ఫీజులు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ తీసుకోలేము. ఇది మాకు చక్కటి అవకాశం. ఈ కోర్సులపై శిక్షణ అందితే భవిష్యత్తులో ఇంకా ఎంతో నేర్చుకోవచ్చు.

ఐఐటికి మార్గం సుగమం

పవన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, చెల్పూర్



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐఐటి మద్రాస్ ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ఐఐటిలో సీటు సంపాదించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ విషయంపై మేము విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. బయట దాదాపు మూడేళ్ల కోచింగ్ తీసుకోవడంతో ఇంటర్ తర్వాత విద్యార్థులు ఐఐటి సీట్లు సాధించే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గొప్ప అవకాశం

: భూపతి శ్రీనివాస్, ఎంఈవో, హుజూరాబాద్



ఐఐటిలో పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ కోర్సుకు సంబంధించి శిక్షణ ఇస్తున్న విషయంపై పిల్లలకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. హైస్కూల్ దశలోనే ఐఐటీ స్థాయిలో ప్రాథమిక అంశాలు నేర్చుకోవడం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గొప్ప అవకాశం. శిక్షణ తీసుకున్న విద్యార్థులు భవి ష్యత్తులో గొప్పగా రాణించే అవకాశం ఉంటుంది. విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ చేయాలని ఉపాధ్యాయులకు సూచిస్తున్నాం.



పిడుగు పడి 30 గొర్రెలు మృతి

- కాపరికి తప్పిన ప్రాణాపాయం



మృతి చెందిన గొర్రెల వద్ద బాధిత కుటుంబీకులు

మంథనిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గోదావరి ఒడ్డున సోమవారం సాయంత్రం గొర్రెల మందపై పిడుగు పడటంతో 30 గొర్రెలు మృతి చెందగా గొర్రెల కాపరికి ప్రాణాపాయం తప్పింది. చిల్లపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పుట్ట పోచయ్య గొర్రెలను మేపడానికి గోదావరి వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని వర్షం పడింది. అకస్మాత్తుగా గొర్రెల మందపై పిడుగు పడటంతో 30 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. వాటికి దగ్గరలో ఉన్న పోచయ్య పిడుగుపాటుకు స్పృహతప్పి కిందపడ్డాడు. సమీపంలో ఉన్న మరో గొర్రెల కాపరి గోపు గంగయ్య కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు పోచయ్యను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చనిపోయిన గొర్రెల విలువ రూ.3 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం బాధితుడికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

బాకీ డబ్బులు అడిగినందుకు దాడి.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): తన బాకీ డబ్బులు తీర్చాలన్నందుకు దాడి చేసి చంపుతానని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గోగూరి ప్రదీప్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి సోమవారం తెలిపారు. గ్రామంలోని ప్రదీప్‌రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద బోరు వేయించుకుంటాని అదే గ్రామ వాసి పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వద్ద రూ.70 వేలు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తీర్చాలని ఈ నెల 20న అడిగితే కోపోద్రిక్తుడైన ప్రదీప్‌రెడ్డి అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు దాడి చేసి చంపుతానని శ్రీనివాస్‌రెడ్డిని బెదిరించాడని ఎస్సై పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రదీప్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన ఇనుగుర్తి కాంతం (45) అనే వ్యక్తి సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలి పారు. ఒంటరితనంతో బాధపడుతున్న కాంతం తాగుడుకు బానిసయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

నూకపల్లి అర్బన్ కాలనీలోకి నీరు





అర్బన్‌కాలనీలో వర్షపు నీరు, ఇంటిలోకి వచ్చిన నీరు

జగిత్యాల అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని నూకపల్లి అర్బన్ కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో చిన్న పాటి వర్షానికే ఇళ్లలోకి నీరు వచ్చి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరి వస్తువులన్నీ తడిసి పోయాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో మురికి కాలువలు పూర్తి స్థాయిలో నిర్మాణం కాక పోవడం వల్ల మురికి కాలువ నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని పేరొన్నారు. ప్రదాన రహదారి చిన్న పాటి వర్షానికే బురదమయం అవుతుండగా అంతర్గత రహదారులు సైతం వర్షానికి నీటితో నిండిపపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ నంబర్ 7,8లో చిన్న వర్షానికే నీరు చేరుతుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

మూతపడిన 'సహారోగ్య'

- బ్యాంకులో రూ.10.70 కోట్ల రుణం
- షాపుల కిరాయి, సిబ్బంది జీతాలు ఎగవేత

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సహారోగ్య మెడికల్ షాపులు మూతబడ్డాయి. రెండేళ్ల క్రితం పలు జిల్లాల్లో అట్టహాసంగా ప్రారంభమైన బ్రాంచ్‌లను క్రమంగా మూసి వేసింది. సహారోగ్య హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పెద్దపల్లిలోని ఒక బ్యాంకులో రూ.10.70 కోట్లు రుణం తీసుకొని పలు జిల్లాల్లో మెడికల్ షాపులను ప్రారంభించింది. కొద్ది రోజులపాటు వాటిని నిర్వహించి ఆ తర్వాత మూసేసింది. బ్యాంకు రుణాలకు సంబంధించిన నెలనెలా కిస్తు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు లీగల్ నోటీసులు జారీ చేశారు. మెడికల్ షాపులకు షెటర్‌లను అద్దెకు ఇచ్చిన యజమానులు కిరాయి డబ్బులు చెల్లించకపోవడం, ఖాళీ చేయకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా విషయం వెలుగులోకి వచ్చింది.



పెద్దపల్లిలో మూసిఉన్న మెడికల్ షాప్

సహారోగ్య హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ హైదరాబాద్‌కు చెందిన కరణం నాగేంద్ర ప్రసాద్, చీకురాయికి చెందిన జక్కుల అశోక్ కుమార్ సహారోగ్య పేరిట పెద్దపల్లి మండలం చీకురాయికి చెందిన జక్కుల తిరుపతి, పెద్దపల్లి పట్టణానికి చెందిన కొమిరిశెట్టి కనుకయ్య, నారాయణ స్వామి సురేష్ పేరిట గల భూములను పెద్దపల్లిలోని ఎస్‌బీఐ (ఏడీబీ) బ్యాంకు పేరిట మార్ట్ గేజ్ చేశారు. 2022 మే 31న 4 కోట్ల 50 లక్షలు, 2023, అక్టోబర్ 7వ తేదీన 6 కోట్ల 20 లక్షల రూపాయలు రుణంగా తీసుకున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, గోదావరిఖని, జమ్మికుంట, హుజూరాబాద్, కరీంనగర్, జగిత్యాల, భూపాలపల్లి, జనగాం, హన్మకొండ, కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట, రామాయంపేట తదితర ప్రాంతాల్లో భవనాలను అద్దెకు తీసుకుని సహారోగ్య పేరిట మెడికల్ షాపులను తెరిచారు. ఈ షాపుల్లో ఫార్మసిస్టులు, సిబ్బందిని నియమించి కొద్ది రోజులపాటు నడిపించి అనంతరం మూసి వేశారు. సహారోగ్య మెడికల్ షాపులను మూసి వేశారని తమకు రావాల్సిన అద్దె డబ్బులు లక్షా 80 వేల రూపాయలు ఇప్పించాలని ఈ ఏడాది మార్చి 19న పోలీసులకు, అదే నెల 24వ తేదీన ప్రజావాణిలో కలెక్టర్‌కు షాపు యజమాని సహేత భాను, ఎండీ రహీముద్దీన్ ఫిర్యాదు చేశారు. అద్దె బకాయిలు చెల్లించకపోయినా కొందరు షట్టర్లను ఖాళీ చేయించారు. మరి కొందరు వాటిని ఖాళీ చేయాలని కోరుతున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దపల్లి ఎస్‌బీఐ (ఏడీబీ) బ్యాంకులో తీసుకున్న రుణానికి సంబంధించి కిస్తీలు కోటి రూపాయల లోపు చెల్లించినట్లు సమాచారం. ఆ తర్వాత కిస్తీలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు సహారోగ్య సీఈఓ నాగేంద్ర ప్రసాద్, జక్కుల అశోక్‌కుమార్, కొమిరిశెట్టి కనుకయ్య, నారాయణ స్వామి సురేష్ కుమార్, జక్కుల తిరుపతి, సెట్టిపల్లి సుబ్బరామయ్యకు బ్యాంకు అధికారులు లీగల్ నోటీసులు పంపించారు. అయితే బ్యాంకు రుణాల కోసం మార్టిగేజ్ చేసిన కొమిరిశెట్టి కనుకయ్య, నారాయస్వామి, సురేష్‌కుమార్‌ల పేరిట పట్టణంలో 290 సర్వే నంబర్‌లో గల 20 గుంటల భూమి కోర్టు వివాదంలో ఉంది. ఆ భూమిని చూపి నిర్వాహకులు రుణాలు తీసుకున్నారు. సహారోగ్య పేరిట మెడికల్ షాపులను తెరిచి వాటిని మూసి వేసి అద్దె డబ్బులు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్న నాగేంద్రప్రసాద్, అశోక్ కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని అద్దె భవనాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

24 నుంచి పెద్దపల్లి రైల్వే బైపాస్ మార్గం ఇంటర్ లాకింగ్ పనులు

- పలు రైళ్లు రద్దు

పెద్దపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న బైపాస్ రైలు మార్గాన్ని అందుబాటులోకి తీసుక వచ్చేందుకు ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కాజీపేట-బల్లార్షా లైన్‌లో కొన్ని రైళ్లు పూర్తిగా, కొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. కరీంనగర్ నుంచి సిర్‌పూర్‌కు నడిచే మెమూ ఎక్స్‌ప్రెస్, రామగిరి మెమూ ఎక్స్‌ప్రెస్ రైళ్లను 25, 26, 27 తేదీల్లో రద్దు చేశారు. కాజీపేట నుంచి బల్లార్షా వరకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు 24 నుంచి 26 వరకు బల్లార్షా ఎగువ మార్గంలో, 25 నుంచి 27 వరకు దిగువ మార్గంలో కాజీపేట వైపు రద్దు చేశారు. సికింద్రాబాద్ నుంచి సిర్‌పూర్ వరకు నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు 25 నుంచి 27 వరకు పూర్తిగా రద్దు చేశారు. హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు కాగజ్‌నగర్ నుంచి బీదర్ వరకు నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు 25 నుంచి 27 వరకు, భద్రాచలం రోడ్ నుంచి బల్లార్షా, సిర్‌పూర్ నుంచి భద్రాచలం వరనకు నడిచే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను 25 నుంచి 27 వరకు రద్దు చేశారు. ఈ నెల 24న కొత్త ఢిల్లీ నుంచి నాంపల్లి హైదరాబాద్ వెళ్లే తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు దక్షిణ మధ్య జోన్ పరిధిలో ఒక గంట 15 నిమిషాల పాటు నియంత్రణ చేశారు. నిజాముద్దీన్ ఢిల్లీ కేఎస్ఆర్ బెంగుళూర్ సిటీ మధ్య నడుస్తున్న రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైలు జోన్ పరిధిలో 20 నిమిషాలు, చెన్నై సెంట్రల్ నుంచి కొత్త ఢిల్లీ, తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య జోన్ పరిధిలో గంట సేపు నియంత్రణ చేశారు. తిరుపతి నుంచి కరీంనగర్ వరకు నడిచే బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు 26న తిరుపతి నుంచి రాత్రి 8:05 గంటలకు బదులు రాత్రి 10:35 గంటలకు బయలుదేరనున్నదని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

శాశ్వత మరమ్మతులు పట్టవా?

- మూలవాగులో కొట్టుకుపోతున్న తాత్కాలిక రోడ్లు
- ప్రతి యేటా ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మామిడిపల్లి - నిజామాబాద్ మూలవాగు వద్ద కొట్టుకపోయిన కాజ్ వేపై వాగు దాటడానికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

కోనరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మూలవాగులో కొట్టుకపోయిన కాజ్ వేల స్థానంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తాత్కాలికంగా చేపట్టిన రోడ్లు మూలవాగు వరద తాకిడికి ప్రతి యేటా కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్, బావుసాయిపేట, వెంకట్రావుపేట, వట్టిమల్ల, నిమ్మపల్లి గ్రామాలను కలిపే రహదారులకు గత కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం మూలవాగులో కాజ్ వేల నిర్మాణం చేపట్టగా గత ఆరు సంవత్సరాల క్రితం మూలవాగు ఉధృతికి కాజ్ వేలు కొట్టుకపోయాయి. వాటిపై అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. తిరిగి వర్షాకాలం రాగానే మూలవాగులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్లు కొట్టుకుపోతున్నాయి. దీంతో వాగు దాటడానికి రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత కాంగ్రెస్ పాలనలో ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రోత్సాహంతో అప్పటి ఆర్అండ్‌బి మంత్రి జీవన్‌రెడ్డి నిధులు కేటాయించగా కాజ్ వేలు చేపట్టారు. కాజ్ వేలు వరద తాకిడికి కొట్టుకపోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. కానీ శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసి పనులు చేపట్టకపోవడంతో తాత్కాలిక రోడ్లు ప్రతియేటా కొట్టుకుపోతున్నాయి. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండిపోయింది. మళ్లీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని మండలవాసులు కోరుతున్నారు.



వరద తాకిడికి కొట్టుకపోయిన మామిడిపల్లి-నిజామాబాద్ కాజ్ వే

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- డేంజర్ జోన్‌గా ఆరెపల్లి-నందికమాన్ రోడ్డు
- నాలుగు వరుసల రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్

వేములవాడ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఆరెపల్లి నుంచి నందికమాన్ వరకు డేంజర్ జోన్‌గా మారింది. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, గొల్లపల్లి, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి నాంపల్లి గ్రామాలు కలిసి ఉండటంతో తరచూ జన సంచారంతో రోడ్డు బీజీగా ఉంటుంది. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంకెపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మూలమలుపు ఉండటంతో కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికులు రోడ్డు ప్రమాదాలబారిన పడుతున్నారు.

డేంజర్ జోన్‌గా ఆర్అండ్ఆర్ కాలనీలు

వేములవాడ మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, శాభాష్‌పల్లి, కొడుముంజ గ్రామాల్లోని ప్రధాన రోడ్డు డేంజర్ జోన్‌గా మారింది. రుద్రవరం గ్రామం సమీపంలో ఒకవైపు రుద్రవరం సంకెపల్లి గ్రామాలు ఉండగా మరోవైపు గొల్లపల్లి, సంకెపల్లి గ్రామాలు రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. గొల్లపల్లి గ్రామానికి రావాలన్నా, రోడ్డు దాటాల్సివచ్చినా ప్రజలు జంకుతున్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి వైపు రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో గొల్లపల్లికి చెందిన రాములుకు, సంకెపల్లికి చెందిన విజయ్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అదే గ్రామానికి చెందిన తిరుపతి-స్వప్న దంపతులు రోడ్డు దాటే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కిందపడి గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ఇటీవల వేములవాడ మండలం శాభాష్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ సంఘం సభ్యులు కొదురుపాక గ్రామంలోని బ్యాంకుకు వెళ్లేక్రమంలో సైకిల్‌పై వెళుతున్న బాలుడిని తప్పించబోయిన ఆటో బోల్తాపడింది. ఈ ఘటనల 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి.



ప్రమాదకరంగా ఉన్న సంకెపల్లి మూలమలుపు

తరచూ ప్రమాదాలు

వేములవాడ మండలం ఆరెపల్లి నుంచి నాంపల్లి నందికమాన్ వరకు రోడ్డు వెడల్పు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మార్చి 15వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో 'డేంజర్ జోన్‌గా మూడు గ్రామాల కూడలి' కథనం ప్రచురితమైంది. ఏప్రిల్ 15వ తేదీన అనుపురం గ్రామానికి చెందిన శ్రీహరి అనే వ్యక్తి తన ఇంటికి ద్విచక్రవాహనం మీద వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. జూన్ 18వ తేదీన కారు ప్రమాదంలో రుద్రవరం గ్రామ బస్టాప్ ముందు నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మికుడు, ఆరెపల్లిలో ద్విచక్ర వాహనంపై వేములవాడకు వస్తున్న పట్టణానికి చెందిన యువకుడు మృత్యువాత పడ్డాడు.

సంకెపల్లి, అనుపురం, నాంపల్లి గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు శాఖ ఆధ్వర్యంలో బారికేడ్స్‌ను ఏర్పాటు చేశారు. ఆరెపల్లి, సంకెపల్లి గ్రామాల్లో వాహనాల స్పీడ్ అదుపులోకి తీసుకురావడానికి స్పీడ్‌బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని, నాలుగు వరసల రోడ్డుతో పాటు కాలనీలో సర్వీస్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

నాలుగు వరుసల రోడ్డు నిర్మించాలి

- ఎర్రం మహేష్, అనుపురం



నిత్యం వేల మంది రాజన్న ఆలయానికి వస్తుంటారు. డబుల్ రోడ్డు కావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగు వరసల రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రమాదాలకు చెక్‌పెట్టాలి.

మిత్రుడిని కోల్పోయాం

- మ్యాకల రవి, అనుపురం



మా మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కలిచివేస్తోంది. నాలుగు వరుసల రోడ్డుతో పాటు, సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి. రోడ్డు దాటాలంటే గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

నిర్మల్-జగిత్యాల రోడ్డు విస్తరణకు మోక్షం

- రెండో దశ నిర్మాణానికి ఆమోదం

రాయికల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏళ్లగా ఎదురు చూస్తున్న నిర్మల్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణానికి మోక్షం లభించింది. జాతీయ రహదారి-61 నిర్మాణ ఏర్పాటుకు 2018లో ప్రాథమిక సర్వే చేపట్టగా, 2020లో తొలి విడత నిర్మల్-ఖానాపూర్ రహదారికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. ఖానాపూర్ మండలం సుర్జాపూర్ వరకు పనులు పూర్తి కావస్తున్నాయి. రెండవ విడతలో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండం ఒబులాపూర్ నుంచి రాయికల్ మీదుగా జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ వరకు పనులకు మోక్షం లభించింది. జాతీయ రహదారులు రవాణా మంత్రిత్వ శాఖ (ఎంవోఆర్‌టీహెచ్) ఆమోద ముద్ర వేసింది. నిర్మల్-జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణంతో ఇరు జిల్లాల మధ్య మార్గం మరింత సుగమం కావడంతో పాటు మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాలకు ప్రయాణం సులువు కానుంది.

జిల్లాలో 39 కి.మీ.

మహారాష్ట్రలోని కళ్యాణ్ నుంచి ప్రారంభమయ్యే 61వ నెంబర్ జాతీయ రహదారి బైంసా మీదుగా నిర్మల్ వరకు నిర్మాణం జరిగింది. నిర్మల్, జగిత్యాల జిల్లాలో 74 కి.మీ. రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. గతంలో ప్రాథమిక సర్వే పూర్తి చేశారు. తొలి విడతలో నిధులు మంజూరు కాగా, నిర్మల్ నుంచి ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి వరకు 35 కి.మీ. మేర రహదారి నిర్మాణం చివరి దశలో ఉంది. రెండవ విడత జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ఒబులాపూర్ నుంచి చల్‌గల్ వరకు 39 కి.మీ. మేర పనులు చేపట్టాల్సి ఉంది.



రాయికల్-జగిత్యాల రహదారి

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

గన్నేరువరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే పోయిన ఫోన్‌ను గుర్తించవచ్చని ఎస్సై నరేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన చావుల మధుకర్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులకు సమాచారం అందించి సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. 24 గంటలలోనే సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి పట్టుకుని సోమవారం మధుకర్‌కు అందించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎస్సై సూచించారు.

కలువ పూల అందాలు చూడతరమా..!



చూపరులను ఆకట్టుకుంటున్న నాంపల్లి చెరువు

వేములవాడ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గుడిబండ చెరువులో వికసించిన తామర పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నిత్యం వేల సంఖ్యలో భక్తులు చెరువుకట్ట మీదుగా రాజన్న ఆలయానికి వస్తుంటారు. దీంతో భక్తులకు గుడిబండ చెరువులోని కమలం పువ్వులు కనువిందు చేస్తున్నాయి.

ఉపాధిలో సాగునీటి కాలువల పూడికతీత

ఆనందం వ్యక్తం చేస్తున్నరైతులు

ఇల్లంతకుంట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వలసల నివారణకు ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం కింద మండలంలోని పలు గ్రామాల్లో సాగునీటి కాలువల పూడికతీత పనులు చేపట్టారు. గ్రామాలలోని చెరువులు, కుంటలకు వచ్చే కాలువల్లో పూడిక పేరుకపోవడం, పలు ప్రాంతాల్లో నీరు రాకుండా అడ్డుగా బండరాళ్లు ఉండటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కాలువలను శుభ్రం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇల్లంతకుంట, వెంకట్రావుపల్లె, రహీంఖాన్‌పేట, గాలిపెల్లి, ముస్కానిపేట, తాళ్లపెల్లి తదితర గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో పనులు చేపట్టారు. కూలీలకు ఉపాధి లభించడమే కాకుండా వర్షాలు కురిస్తే గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసినా అనంతారం ప్రాజెక్టులోకి నీరు రావడం ఆలస్యం అవుతుందని, రైతులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకవచ్చారు. దీనితో మండలపరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి దీనిపై చర్చించారు. కాలువలు శుభ్రంగా ఉన్నట్లయితే సమస్య తగ్గుతుందని భావించి అన్ని గ్రామాల్లో పూడికతీత పనులు కొనసాగించారు. మండలంలోని ప్రధానమైన చెరువులు నిండినట్లయితే పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొంటున్నారు.



ఇల్లంతకుంటలో పూడిక తీసిన కాలువ

గోడెక్కిన పాము..



గేటుపై నుంచి దిగుతున్న పాము

సిరిసిల్ల టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆహారం కోసం ఓ పాము (జెర్రిపోతు) గోడెక్కింది. పాము వస్తోందని గ్రహించిన తొండ తొట్టిలోని అలోవేరా చెట్టు ఆకుల మధ్య దాగుంది. అయినా పాము తొండను నోట కరిచి తినేసింది. అనంతరం మెల్లగా గోడ మీదుగా గేటుపైకి చేరుకొని కిందికి దిగి ఇంటి ఆవరణ నుంచి బయటకు వెళ్లింది. ఆ సమయంలో ఇంటి యజమానులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమరాతో క్లిక్‌మనిపించింది.

దక్షిణ ఇండియా క్రైస్తవ సంఘం మాడరేటర్‌గా కరీంనగర్ బిషప్



రూబెన్‌మార్క్

కరీంనగర్ కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఐదు రాష్ట్రాలకు కలిపి దక్షిణ ఇండియా క్రైస్తవ సంఘం మాడరేటర్‌గా కరీంనగర్ బిషప్ డాక్టర్ కె.రూబెన్‌మార్క్ ఎన్నికైనట్లు అధ్యక్ష మండలలే సెక్రెటరీ ఎర్ర జాకబ్ తెలిపారు. సోమవారం అధ్యక్ష మండల కార్యాలయ ప్రాంగణంలో వెస్లీ క్యాథడ్రల్ చర్చ్, సెంటినరీ వెస్లి చర్చ్, ఎంఎండీ చర్చ్ సభ్యులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో కాదాసి ప్రశాంత్, జిబిసంజయ్, సత్యం, సిహెచ్ శామ్యూల్, కట్ట బెనర్, బొబ్బిలి విక్టర్, సూర్య ప్రకాశ్, నికోలస్, సూర్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం

- విత్తనబంతుల తయారీలో ఖైదీలు
- సేవ్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా వినూత్న ప్రయత్నం
- ఎర్రమట్టి, జీవామృతం, వర్మీకంపోస్టుతో 15 వేల విత్తన బంతుల తయారీ



గుట్టలు, కొండల ప్రాంతాల్లో విత్తన బంతులను విసురుతున్న జైలు అధికారులు, సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వాతావరణం కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోంది. ఇష్టానుసారంగా చెట్లను నరికివేయటం, భూగర్భాన్ని తొలచి సహజవనరులను వెలికితీసి విచ్చలవిడిగా వినియోగిస్తూ పర్యావరణాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నాం. పర్యావరన పరిరక్షణకు కరీంనగర్ జైలులోని ఖైదీలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న వన మహోత్స వాన్ని విజయవంతం చేయడానికి కరీంనగర్ జిల్లా జైలులోని ఖైదీలు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. విత్తన బంతులు తయారు చేస్తున్నారు. ఖైదీలు తయారు చేసిన విత్తన బంతులతో గుట్టలు, కొండల ప్రాంతాలకు పచ్చదనం తేవాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామాలు, నగరాలు, రహదారుల వెంట మొక్కలు నాటేవారు. వాటికి పశువుల నుంచి రక్షణ లేకపోవడం, నీటిని అందించలేక చాలా మొక్కలు చనిపోయేవి. మరోవైపు గుట్టలు, కొండల ప్రాంతంలో మొక్కల పెంపకం కష్టంతో కూడుకున్నది. ఈసారి ఎలాగైనా ప్రభుత్వ భూములు, గుట్టలు, కొండల ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. అందులోభాగంగానే ఖైదీల ఆధ్వర్యంలో విత్తనబంతుల తయారీని చేపట్టారు.



విత్తన బంతుల పెట్టెలతో జైలు అధికారులు, సిబ్బంది

● చొప్పదండి నుంచి ఎర్రమట్టి...

కరీంనగర్ జైలులో తయారు చేస్తున్న విత్తన బంతుల కోసం చొప్పదండి ప్రాంతం నుంచి నాణ్యమైన ఎర్రమట్టిని జైలు సూపరింటెండెంట్ జి విజయ్‌డేని తెప్పించారు. మొదట కరీంనగర్ ఓపెన్ జైలులో ఉన్న చింత, అల్లనేరడి, వేప, కానుగ విత్తనాలను సేకరించి జైలు ఆవరణలో ఆరబెట్టారు. తరువాత ఎర్రమట్టికి జీవామృతం, వర్మీకంపోస్టును కలిపి సపోటా పండు పరిమాణంలో బంతులుగా తయారు చేసి మధ్యలో విత్తనాన్ని పెట్టారు. గతంలో ప్రత్యేక శిక్షణ పొందిన వారిలో కొందరు ఖైదీలుండగా మరికొందరు కలిసి బంతులను తయారు చేశారు. ఖైదీలు తయారు చేసిన ఈ విత్తన బంతులను ఆరబెట్టిన తర్వాత ఎప్పటికప్పుడు జైలులోని గోదాంలో భద్రపరుస్తున్నారు. ఐదేళ్ల క్రితం కరీంనగర్ జైలులో ఖైదీలు 3.5 లక్షల వరకు విత్తన బంతులు తయారు చేశారు.

విత్తన బంతుల ఉపయోగం ఇలా..

విత్తన బంతుల వల్ల మొక్కను ప్రత్యేకంగా నాటే అవసరం ఉండదు. సీడ్ బాల్స్‌ను గుట్టలు, కొండల ప్రాంతాల్లో చల్లుతారు. వర్షం కురిసినప్పుడు విత్తనబంతి తడిసి అందులోని విత్తనం బయటకు వస్తుంది. అది మొక్కగా నాటుకుంటుంది. వీటికోసం ట్రీగార్డ్స్, నీటి సరఫరా లాంటి ప్రత్యేక చర్యలు అవసరం లేదు. ఖర్చు తక్కువ, లాభం ఎక్కువ ఉండడంతో వీలైనంత ఎక్కువగా విత్తన బంతులను తయారు చేయించాలని జైళ్ల శాఖ భావిస్తున్నది. ఇటీవల జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా ఆదేశాలతో కరీంనగర్ జిల్లా జైలు అధికారులుఖైదీలతో జైలు ఆవరణలో లభించిన వేప, చింత, కానుగ, అల్లనేరడి తదితర రకాల విత్తనాలతో విత్తన బంతులు తయారు చేయించారు. కరీంనగర్ జైలులోని 50 మంది ఖైదీలు ప్రతిరోజు విత్తన బంతులు తయారు చేస్తున్నారు. నెల రోజుల్లో 15 వేల సీడ్‌బాల్స్‌ను తయారు చేశారు. ఇందులో మూడు వేల సీడ్ బాల్స్‌ను హుజురాబాద్ సబ్ జైలుకు పంపించారు. హుజూరాబాద్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములు, గుట్టలు, కొండ ప్రాంతాల్లో అక్కడ ఇసబ్ జైలు అధికారులు ఈ విత్తన బంతులను చల్లనున్నారు. కరీంనగర్ జైలు అధికారులు కమాన్‌పూర్, చింతకుంట, రేకుర్తి ప్రాంతాల్లో ఆదివారం విత్తన బంతులను చల్లారు.



ఖైదీలు తయారుచేసిన విత్తన బంతులు

కొండ, గుట్ట ప్రాంతాల్లో ఉపయోగం..: జీ విజయ్‌డేని, కరీంనగర్ జైలు సూపరింటెండెంట్



వన మహోత్సవంలో భాగంగా జైళ్ల శాఖ డీసీ డాక్టర్ సౌమ్యమిశ్ర ఆదేశాలతో ఖైదీలచేత 15 వేల విత్తన బంతులను తయారు చేశాం. ఈ బంతులను అటవీశాఖ అధికారుల సూచనల మేరకు ప్రభుత్వ భూములు, గుట్టలు, కొండ ప్రాంతాల్లో చల్లుతున్నాం. వీటికి ఎటువంటి రక్షణ లేకుండానే సహజసిద్ధంగా మొలకెత్తుతాయి. కరీంనగర్ జైలులో ఉన్న ఖైదీలు తమ వంతు సేవలు అందించారు. జైలు ఆవరణలోని చెట్ల నుంచి సేకరించిన విత్తనాలు, జీవామృతం, వర్మికంపోస్టును ఉపయోగించి విత్తన బంతులు తయారు చేశాం.

రాజన్నకు భక్తుల మొక్కులు

సందడిగా మారిన ఆలయం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా కనపడింది. భక్తులు ఉదయాన్ని ధర్మగుండంలో స్నానాలు చేసి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశించారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న భక్తులు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రాధాబాయి నేతృత్వంలో ఏఈవోలు, సూపరిండెంట్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాశరథి పురస్కారానికి 'అన్నవరం' ఎంపిక

నేడు రవీంద్రభారతిలో సీఎం, అతిథుల చేతుల మీదుగా ప్రదానం



కరీంనగర్ కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రా నికి చెందిన కవి, రచయిత అన్నవరం దేవేందర్ 2025 సంవత్సరానికిగాను దాశరథి కృష్ణ మాచార్య రాష్ట్ర ప్రభుత్వ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. దాశరథి శత జయంత్యుత్సవాల సందర్భంగా మంగళవారం సాయంత్రం రవీంద్ర భారతిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మీదుగా ఈ పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. దేవేందర్ ఇప్పటి వరకు 12 కవితా సంపుటాలు వెలువరించారు. ఆయన రచించిన మూడు పుస్తకాలు ఆంగ్ల బాషలోకి అనువాదమయ్యాయి.

'స్ఫూర్తి'దాత 'పాకాల'..

- విద్యార్థుల్లో పోటీతత్వానికి క్విజ్ పోటీలు
- ఇన్‌స్పైర్ శిబిరాలకు జాతీయ గైడ్‌గా మన్ననలు
- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు



జాతీయ ఇన్‌స్పైర్ ప్రదర్శనలో శంకర్‌గౌడ్ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

విద్యార్థులకు రోల్ మోడల్‌గా.. ఇన్‌స్పైర్‌గా ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్ నిలుస్తున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధించడమే వరకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయడానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి 2014-2016 వరకు కొలనూరు పాఠశాలలో జిల్లావ్యాప్తంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. 2020 కరోనా కాలంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించి ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి డాక్టర్ల సహాయంతో కరోనా హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశారు.సమాజంలో మూఢ నమ్మకాలు తొలగించి సైన్స్‌ని ప్రోత్సహించాలని ఉద్దేశంతో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీలో, పని చేస్తున్నారు. కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు కథలు, పాటలు, కవితలు రాయడంలో మానేరు రచయితల సంఘం, తెలంగాణ రచయితల వేదికల సౌజన్యంతో కర్యశాలలను నిర్వహించారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు గైడ్‌గా...

ఇన్‌స్పైర్ అవార్డులు సాధించడానికి విద్యార్థులను ముందుండి నడిపించారు. సైన్స్‌లో ప్రయోగాలు చేపిస్తూ సైన్స్‌ఎగ్జి బిషన్లలో, ఇన్‌స్పైర్ అవార్డులలో, అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వాహణలో ప్రతిభ కనబరిచారు. గైడ్ టీచర్‌గా తయారు చేసిన పవర్‌లుమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్‌కు 2022-23 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మానాక్ జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికై పలువురు మన్ననలను పొందింది. ఇప్పటికీ మూడుసార్లు ఇన్‌స్పైర్ మానక్, జేఎన్‌ఎంఎస్ఎస్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర స్థాయికి గైడ్ టీచర్‌గా, ప్రాజెక్టులకు గైడ్ టీచర్‌గా ఎంపికయ్యారు.

ప్రభుత్వ ఐటీఐపై విద్యార్థుల ఆసక్తి



- కరీంనగర్‌లో 172 సీట్లతో ఏటీసీ ఏర్పాటు
- అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభం
- మొదటి విడతలో 54 సీట్ల కేటాయింపు
- ప్రారంభం కానున్న రెండో విడత ప్రవేశాలు

గణేశ్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో వృత్తి నైపుణ్య శక్తిని, సృజనాత్మను వెలికి తీసేందుకు ఐటీఐ కళాశాలల్లో ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఏటీసీ కేంద్రాల ద్వారా విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి ఆ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాలు చూపిస్తుంది. దీంతో విద్యార్థులు ఐటీఐ, ఏటీసీల్లో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. పదో తరగతి అనంతరం చాలా కోర్సులు విద్యార్థులు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల ఐటీఐ విద్యను పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను (ఏటీసీ) ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభం కాగా.. తొలి విడత సీట్ల కేటాయింపు పూర్తయింది. రెండో విడతలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు కోరు తున్నారు. రెండో విడత ప్రవేశాల ప్రక్రి య ఆగస్టు 31 వరకు జరగనుంది. మిగిలిన సీట్లు స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తారు.



కరీంనగర్ ఐటీఐలో 412 సీట్లు

కరీంనగర్ లోని ఉజ్వల పార్క్ సమీపంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాలలో మొత్తం 412 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 240 సీట్లు ఐటీఐవి కాగా.. 172 సీట్లు ఏటీసీ కోర్సులవి. తొలి విడతలో ఐటీఐలో 54 సీట్లు కేటా యించారు. రెండో విడత సీట్ల కేటాయింపు ప్రారంభం కానున్న సందర్భంగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ కళాశాల కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ వై గంగాధర్ తెలిపారు. ఐటీఐ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. రామగుండం ఎన్టీపీసీ జీఎం బినోయ్ జోస్ చైర్మన్‌గా టీ-గేట్ (తెలంగాణ గేట్‌వే ఫర్ అడాప్టివేట్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయి మెంట్) కరీంనగర్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఏటీసీ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ వై గంగాధర్, ఐటీఐ కళాశాల కమిటీ వైస్ చైర్మన్



ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులకు మంచి ఉద్యోగావకా శాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఐటీఐ కళాశాలలతోపాటు ఏటీసీ కేంద్రాలు ఏర్పాటుచేసి శిక్షణను అందిస్తోంది. దీంతోపాటు ఉపాధి మార్గాలు చూపెడుతోంది. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి. ఐటీఐల్లో చేరే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఐటీఐ చేసిన వారు సొంతగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వీలుంటుంది.

ఐటీఐతో ఉద్యోగావకాశాలు

కె. అశోక్‌కుమార్, కరీంనగర్ ఐటీఐ ప్రిన్సిపాల్, కళాశాల కమిటీ కన్వీనర్



ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కేంద్రంలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు వాళ్ల భవిష్యత్తుకు మంచి మార్గాన్ని ఎంచుకున్న వారవుతారు. ఐటీఐ చేసిన వారికి చిన్న స్థాయి పరిశ్రమల నుంచి మొదలుకొని పెద్ద కంపెనీల వరకు ఉద్యోగ అవకాశాలు ఎన్నో ఉన్నాయి. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం కింద ఎన్నో పనులు చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.

రాజన్న ఆలయంలో శ్రావణమాసం వేడుకలు

- ఈనెల 25 నుంచి వచ్చే నెల 23 వరకు ప్రత్యేక పూజలు
- 8న వరలక్ష్మీవ్రతం, 16న గోకులాష్టమి వేడుకలు



వేములవాడ కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో రాధాబాయి ప్రకటనను సోమవారం విడుదల చేశారు. ఈనెల 25వ తేదీ శుక్రవారం నుంచి వచ్చేనెల 23వ తేదీ శనివారం వరకు శ్రావణ మాసం సందర్భంగా భక్తుల రద్దీ ఉంటుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం త్వరితగతిన దర్శనాలు కల్పించేందుకు ఆది, సోమవారాలు, ఇతర ముఖ్య పర్వదినాలలో నిత్యం రాజన్న ఆలయంలో నిర్వహించే పూజల కార్యక్రమాల సమయములను తాత్కాలికంగా నిర్ణయించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యములు తెల్లవారు జామున 3 గంటల నుంచి 3.15 వరకు, సుప్రభాత సేవా ఉదయం 3.15 నుంచి 3.45 వరకు, సర్వదర్శనము ఉదయం 3.45 నుండి 4.50 వరకు, ఆలయ శుద్ధి ఉదయం 4.50 నుంచి 5.10 వరకు, ప్రాతఃకాల పూజ ఉదయం 5.10 గంటల నుంచి 6.30 గంటల వరకు నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు.

శ్రావణ మాసం ప్రత్యేక పూజల వివరాలు...

వేములవాడ రాజన్న ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని మొదటి, రెండో, మూడో, ఐదో శుక్రవారాల్లో శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నాలుగవ శుక్రవారం శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేష పూజలు, ఉదయం శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకము, అర్చన, ఉదయం 8 గంటలకు నుంచి హోమం నిర్వహించనున్నారు. శ్రావణమాసం మొదటి, రెండో, మూడో, నాలుగో సోమవారాల్లో స్వామి వారికి ఉదయం 5.30 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 6.05 గంటల నుంచి కల్యాణ మంటపంలో మహాలింగార్చన నిర్వహించనున్నారు. 9వ తేదీ శనివారం రాఖీ పౌర్ణమి రోజున శ్రావణ శుద్ధ పూర్ణిమ సందర్భంగా ఉదయం 7.45 గంటల నుంచి స్వామివారికి ఉపాకర్మను చేపట్టనున్నారు. అలాగే రాజన్న ఆలయంలో 16వ తేదీ శనివారం గోకులాష్టమి(శ్రీకృష్ణజన్మాష్టమి) ఘనంగా నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో ఉట్లుకొట్టుట, డోలోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు

భగత్‌నగర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు అన్నారు. సోమవారం అంబేద్కర్ బస్ స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో డ్రైవర్లకు మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అంటేనే ప్రయాణికులకు నమ్మకమని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుడా డ్రైవర్లు సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఆర్టీసీ జోనల్ ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.గిరిసింహారావు మాట్లాడుతూ సంస్థలో డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ పి. మల్లేశం, సేఫ్టీవార్డెన్స్ కొమురయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం అభివృద్ధి కార్యక్రమాలలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొంటున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్య వంతెన ప్రారంభోత్సవం, అనంతారం గ్రామసమీపంలోని వంతెన మిగులు పనులకు భూమిపూజ, ఇల్లంతకుంటలోని జిల్లాపరిషత్ పాఠశాలలో గ్యాస్ సిలిండర్ల పంపిణీ, స్వశక్తి మహిళా సంఘాలతో సమావేశం, 50పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, ఒగులాపూర్, ఇల్లంతకుంట గ్రామాల డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం

ఇల్లంతకుంట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) :మండంలోని గాలిపెల్లి గ్రామంలోని రెడ్డి సంఘంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్రవైద్య శిబిరం విజయవంతం అయ్యింది. కరీంనగర్‌లోని మాక్స్ విజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన నేత్రవైద్య శిబిరంలో 100మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది నవీన్, రాజు, దిలీప్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, దేవరెడ్డి, అంజయ్య, సూర్యనారయణ, రవీందర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

11మంది పంచాయతీ కార్యదర్శుల బదిలీ

ఇల్లంతకుంట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిద గ్రామాలలో పనిచేస్తున్న 11మంది గ్రామపంచాయతీ కార్యదర్శులను అంతర్గత బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఉత్వర్వులు జారీచేశారు. సందీప్ రామోజిపేటకు, గిరిజ తెనుగువారిపల్లెకు, బాలరాజు అనంతగిరికి, శ్రీనివాస్ కేసన్నపల్లెకు సరస్వతి సిరికొండకు, ప్రియాంక వెంకట్రావుపల్లెకు, చంద్రశేఖర్ సోమారంపేటకు, శ్రీనివాస్ గూడెపుపల్లికి, పద్మ పొత్తూరకు, ప్రవీణ్‌కుమార్ రేపాకకు, తిరుపతిని వల్లంపట్లకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే తమ స్థానాలలో జాయిన్ కావాలని ఆదేశించారు.

బీసీ రిజర్వేషన్ ఆమోదం హర్షణీయం

ముస్తాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు నిర్ణయం తీసుకోవడం పట్ల ముస్తాబాద్ మండల బీసీ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బండారి మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల సుధాకర్, డీటీఎఫ్ మండల అధ్యక్షులు అంజాగౌడ్, కె శేఖర్ బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడ్గురాళ్ల సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి వైద్యానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న పారిశుధ్య కార్మికుడు వినోద్ వైద్యానికి మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు సోమవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన వైద్యం తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు నర్సింహారెడ్డి, సీత్యానాయక్, శరవింద్, దేవనందం, గోపాల్ తదితరులు ఉన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిశష్కారమే లక్ష్యంగా ఈనెల 23న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు బండారి చందుగౌడ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో అనేక సమస్యలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడి కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని కేటాంచాలనే డిమాండ్లతో వామపక్ష విద్యార్థి సంఘూల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. సమావేశంలో సంఘ నాయకులు సావనపెల్లి విష్ణు, జుట్టు సురేందర్, ఏనుగుల అరవింద్, రాజు, అనీల్, అఖిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మానేరులో క్రికెట్ ఆడి బీఆర్ఎస్ నిరసన

గంభీరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరులో సోమవారం బీఆర్ఎస్ యూత్ నాయకులు క్రికెట్ ఆడి నిరసన తెలిపారు. ప్రతి ఏటా వర్షాకాలంలో నిండు కుండలా కనిపించే మానేరు జలాశయం నీళ్లు లేక వెలవెలబోతుందని యూత్ నాయకులు పేర్కొన్నారు. ఈ పరిస్థితులు రాకూడదనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ముందు చూపుతో కాళేశ్వరం జలాశయాన్ని నిర్మిస్తే, కాళేశ్వరం నుంచి నీళ్లను మానేరుకు తరలించే ఆలోచన ప్రభుత్వం చేయడంలేదని యూత్ నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను ఆన్‌చేసి ఎగువ మానేరుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎడబోయిన రత్నాకర్, మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, నాయకులు శేఖర్‌గౌడ్, వొన్నాల వెంకటేష్, ఆకునూరి రాజేందర్ తదితరులు ఉన్నారు.

మహానంది అవార్డు గ్రహీతకు సన్మానం

గంభీరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో మహానంది అవార్డు గ్రహీత బొంగు మల్లేశంకు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు చేతుల మీదుగా సోమవారం సన్మానం చేశారు. ఇటీవల మల్లేశం తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహానంది అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, కొత్తపల్లి సింగిల్‌విండో చైర్మెన్ సురెందర్, నాయకులు లక్ష్మన్, సురెందర్‌రెడ్డి, లింగమ్‌యాదవ్, వెంకటియాదవ్, రాజు, శేఖర్‌గౌడ్, హన్మంతరెడ్డి, శ్రీమతి, శంకర్ తదితరులు ఉన్నారు.

విగ్రహ నిర్మాణానికి వ్యతిరేకం కాదు

గంభీరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని ముస్తాఫనగర్ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దోమకొండ కృష్ణకాంత్‌యాదవ్ పేర్కొన్నారు. గంభీరావుపేట విలేకరులకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తమ గ్రామ అభివృద్ధిలో భాగంగా భవిష్యత్‌లో ఆ ప్రాంతంలో దుకాణాల సముదాయాన్ని చేపడుతామని అనుకున్నామే తప్ప వేరే ఉద్దేశ్యం లేదన్నారు. మహనీయుడి విగ్రహ నిర్మాణంలో తమవంతు కృషి ఉంటుందని, నిర్మాణం పూర్తి అయ్యేవరకు తమ గ్రామం తరపున దగ్గరుండి సహకరిస్తామన్నారు. తమపై గానీ తమ గ్రామంపై గానీ వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. జయశంకర్ విగ్రహాన్ని తాము అడ్డుకుంటున్నామనే ఆరోపణలకు చాలా బాధపడుతున్నామని, అందు కోసమే గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడి పదవికి రాజీనామా చేసేందుకు నిర్ణయం తీసుకున్నానని కృష్ణకాంత్ వెల్లడించారు.

గీతకార్మికుడికి పరామర్శ

వేములవాడ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన విక్కుర్తి పర్శరాములు గౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుండి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందిన పర్శరాములు బీఆర్ఎస్ సీనయర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పరమార్శించారు. వారి వెంట గుడిసె సదానందం, బాలయ్య, మల్లేశం, నర్సయ్య, జనార్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సాయి, అనిల్, శ్రీనివాస్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాహుల్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తులకు ప్రజలు తమ వివరాలను చెప్పకూడదని అన్నారు. ఏ లింక్‌ను ఓపెన్ చేయకూడదని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ రాహుల్‌రెడ్డి కోరారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

గంభీరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బచ్చు నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఉప్పుల కృష్ణమూర్తి, బొందుగుల ఆంజనేయులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మందుల రవి, కోశాధికారిగా బొందుగుల సంపత్‌లను ఎన్నుకున్నారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతామని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు..



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

వీర్నపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు నూతన రేషన్ కార్డులు అందించి పేదల కడుపు నింపుతుందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ కాపీలను సోమవారం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి పేదవానికి ఉండడానికి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో గూడు,తినడానికి రేషన్ ద్వారా సన్న బియ్యం అందిస్తుందన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా జరుగుతుందని, కార్డులు రాని వారు ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు గత ప్రభుత్వాలు ఓట్ల కోసం హామీలు ఇవ్వడమే తప్ప సంక్షేమ ఫలాలను అందించిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కలెక్టర్ ప్రత్యేక దృష్టితో మారుమూల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు రాక పేద ప్రజలు అన్ని విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అనేక పథకాలను అందిస్తుందన్నారు. మహిళ సంఘాలకు ప్రభుత్వం వివిధ రంగాల్లో అన్ని బాధ్యతలను అప్పగిస్తుందన్నారు. రైతులకు రైతు భరోసాతో పాటు సబ్సిడీ పథకాలను అందిస్తున్నామని అన్నారు. మారుమూల ప్రాంతంలో ప్రజలకు అన్ని వసతులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కల్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.

రేషన్ కార్డు ప్రభుత్వ పథకాలకు కీలకం..

రేషన్ కార్డు ప్రభుత్వం అందించే పథకాలకు ప్రతి వ్యక్తికి కీలకమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వీర్నపల్లిలో అర్హులైన 329 మందికి నూతన రేషన్ కార్డులు మంజూరు కాగా, ఉన్న రేషన్ కార్డుల్లో 975 మందిని అదనంగా చేర్చినట్లు తెలిపారు. అర్హులందరూ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీప మీ సేవా కేంద్రాల్లో రేషన్ ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. నూతన వీర్నపల్లి మండలంలో తహశీల్దార్, మండల పరిషత్, మార్కెట్ యార్డు ఆఫీసులకు స్థల పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిధులతో త్వరలోనే భవన నిర్మాణాలకు భూమిపూజ చేసుకుందామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఆర్డీవో వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ రజిత, ఏసీఎస్‌వో శ్రీలత, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంపీడీవో బీరయ్య, సివిల్ సప్లై డీటీ రజిత, వ్యవసాయాధికారి జయ, ఏపీఎం నర్సయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీటి యాదవ్, నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల అభివృద్ధే బీజేపీ లక్ష్యం

- జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి - మహిళా సంఘ భవనానికి రూ.5లక్షల ఎంపీ నిధులు



స్వశక్తి సభ్యులకు ప్రొసీడింగ్ కాపీని అందిస్తున్న గోపి

వీర్నపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మారుమూల అటవీ ప్రాంతంలోని పల్లెల అభివృద్ధే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని జీవన జ్యోతి గ్రామైక్య సంఘం భవన నిర్మాణం కోసం ఎంపీ ల్యాడ్స్ ద్వారా మంజూరైన రూ.5లక్షల ప్రొసీడింగ్ కాపీని సంఘ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లి అటవీ ప్రాంతం సమస్యలను వివరించినట్లు తెలిపారు. మహిళా సభ్యులు గ్రామైక్య సంఘం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలపగానే భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ ద్వారా నిధులు అందించారన్నారు. వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామైక్య సంఘానికి ఎంపీ నిధులు అందిస్తామన్నారు. రాబోయే కాలంలో ఈ ప్రాంత అభివృద్ధి నిధులను తీసుకొస్తామని పేర్కొన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఎన్నికల తర్వాత అభివృద్ధే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ పని చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామాల్లో ప్రత్యేక పనులను చేపడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు లక్పతి నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు నాగరాజు, పీర్యా, స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి పొన్నాల తిరుపతిరెడ్డి, మహిళ మోర్చా జిల్లా నాయకురాలు పల్లం అన్నపూర్ణ, మండల ఉపాధ్యక్షులు రాజు, జీవన జ్యోతి అధ్యక్షురాలు నీలం కవిత, కార్యదర్శి స్వాతి, కోశాధికారి నర్సవ్వ, వీవోఏ పద్మ, నాయకులు లక్ష్మిరాజం, ప్రకాష్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు గొప్ప వరం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రంగిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు గొప్ప వరమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో సోమవారం 11మంది లబ్ధిదారులకు రూ.4లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, కెసిరెడ్డి నర్సరెడ్డి, తర్రె లింగం, ఇప్ప మహేష్, బైరి గంగమల్లయ్య, పల్లి గంగాధర్, ఎర్రం రాజలింగం, సూర యాదయ్య, గండి ఆశోక్, పూదరి మహిపాల్, గుగ్గిళ్ల వేంకటేశం, దయ్యాల శ్రీనివాస్, చెలుకల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు సర్ధాపూర్‌లోని జగ్గారావుపల్లె, బాబాజీకాలనీలకు చెందిన ఈర్నాల అనిల్‌కు రూ 60వేలు, కొండపల్లి పోచవ్వకు రూ.16 వేలు, కంచర్ల రమేష్‌కు రూ 55వేలు, పెరుమాండ్ల శ్రావణికి రూ 25వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధానకార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు బాలకిష్టయ్య, యాదయ్య, నర్సయ్య, మట్టె రాములు, కిషన్‌రావు, మలన్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో న్యాత లావణ్య లబ్ధిదారుకు మంజూరైన రూ.60వేల సీఎం సహాయనిధి చెక్కును గ్రామశాఖ అధ్యక్షులు రాకేష్‌గౌడ్ సోమవారం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల మెరుగైన వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందించడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సంతోష్ నాయక్, సీనియర్ నాయకులు దేవేందర్, రాజయ్య, కిష్టనాయక్, రాజేందర్, విజయ్, తదితరులు పాల్గోన్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు



రాచర్లగుండారంలో కప్పతల్లి ఆట ఆడుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురవాలని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారంలోని రైతులు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ మండూకంను ఓ కర్రకు మధ్యలో కట్టి ఇంటింటా తిరుగుతూ కప్పతల్లి ఆటలు ఆడారు. కప్పతల్లి తల్లి.. కప్పతల్లి కడుపు నిండ నీళ్ల పోయి.., వానళ్ల కురువాలి వానదేవుడా.. వరి చేలు పండాలి వానదేవుడా.. అంటూ పాటలు పాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లయ్య, తాజా, మాజీ ఉప సర్పంచ్ బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

అధిష్ఠానం మెప్పు కోసమే కేటీఆర్‌పై విమర్శలు

- జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు



సమావేశంలో మాట్లాడుతున్న మాట్ల మధు

సిరిసిల్ల టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీజేపీ అధిష్ఠానం మెప్పు కోసం పార్టీ నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేటీఆర్‌ను విమర్శించడం సరికాదన్నారు. సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అభివృద్ధి చేశారంటూ గొప్పగా చెప్పిన దుమాల శ్రీకాంత్, కంసాల మల్లేశం బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయాక పార్టీ మారి కేటీఆర్‌పై ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడం ఎవరి మెప్పుకోసమంటూ ప్రశ్నించారు. గత ఎన్నికల్లో కేటీఆర్ మద్యం,డబ్బులు పంచి ఎమ్మెల్యేగా గెలిచాడంటూ ఆరోపించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులకు మతిభ్రమించి విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల అభివృద్ధికి కేటీఆర్ ఏం చేశాడో అప్పుడే మరిచిపోయారని బీఆర్ఎస్ పార్టీలో ఉండగా కేటీఆర్‌ను ఇంద్రుడు, చంద్రుడు అంటూ పొగిడిన దుమాల శ్రీకాంత్‌కు విమర్శించే స్థాయి లేదన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకులపై ఎందుకు బీజేపీ నాయకులు స్పందించడం లేదని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనని అర్థం అవుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానికంగా ఏనాడు ఇసుక ఇబ్బందులు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక కష్టాలు మొదలైన్నాయని దీనిపై ఎందుకు బీజేపీ నాయకులు మాట్లాడడం లేదని అన్నారు. ప్రశ్నించే జర్నలిస్టులపై కాంగ్రెస్ నాయకులు, కలెక్టర్ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంసాల మల్లేశం అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ కొయ్యడ రమేష్, నాయకులు సిరివేరి చిరంజీవి, ఇమ్మనేని అనిల్‌రావు, కుర్మ రాజయ్య. సావనపల్లి బాలయ్య, గుండు ప్రేమ్‌కుమార్, నరేష్, పరశురాములు, సుంకపాక మనోజ్, మన్సూర్‌షాదా, వడ్లూరి సాయి, అఫ్రోజ్, నక్క జోహర్, సయ్యద్, హరీస్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మహిళలు కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణా డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 28 మంది మహిళలకు కుట్టుమిషన్లను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా మాట్లాడుతూ మహిళలు కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం రైతు వేదిక ఆవరణలో ఉన్న తహసీల్దార్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, ఏఎంసీ చైర్మన తలారి నర్సింలు, తహసీల్దార్ సురేశ్, యెల్ల బాల్‌రెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, భాను, తాళ్ల విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

చందుర్తి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్సై రమేష్‌లు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో సోమవారం రాత్రి మీకోసం ప్రోగ్రాం నిర్వహించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడప వద్దన్నారు. ఆన్లైన్‌లో, బ్యాంకుల పేర్లు చెప్పి, ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాల విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎనికలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా మల్లేష్ యాదవ్

కోనరావుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శిగా కోనరావుపేట మండలం గొల్లపల్లి వట్టిమల్ల గ్రామానికి చెందిన నూనె మల్లేష్ యాదవ్ ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భత్తుల మహేందర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. నియామకానికి కృషి చేసిన నరేందర్ గౌడ్, లింగమూర్తి, అజయ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి...

వీర్నపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాను చాటిచెప్పాలని ఎన్నికల మండల ఇన్‌చార్జి ఆడెపు రవిందర్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు లక్పతి నాయక్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త గ్రామస్థాయిలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గడపగడపకు చేరవేర్చాలన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు నాగరాజు, పీర్యా, ఉపాధ్యక్షులు రాజు, గంగాధర్, మండల పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం నర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పల్లెల అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధినాయకత్వం ప్రతి నాయకుడు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి ముందుకు సాగుతోందన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, దేవానందం, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, రాజేందర్, రాజునాయక్, నారాయణరెడ్డి, కిష్టారెడ్డి, బాబు, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, రవీందర్, వెంకటేశ్, రాములు, కిషన్, బాపిరెడ్డి, మధు, సుధాకర్ పాల్గొన్నారు.

'భూభారతి'.. కరుణించవా..!

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తుల్లో సిరిసిల్ల మండలంలో 428, వేమువాడ మండలంలో 675, వేములవాడ రూరల్‌లో 1072, ఎల్లారెడ్డిపేటలో 1227, తంగళ్లపల్లిలో 1776, ముస్తాబాద్‌లో 1685, గంభీరావుపేటలో 1403, చందుర్తిలో 1259, బోయినపల్లిలో 764, కోనరావుపేటలో 2690, రుద్రంగిలో 162, వీర్నపల్లిలో 379 మంది దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్రమబద్ధీకరించే చర్యలు మాత్రం జరగలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులో మళ్లీ దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలోని 167 రెవెన్యూ గ్రామాల పరిధిలో సదస్సులు నిర్వహించగా, భూసమస్యలపై 6787 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, సాదాబైనామాలు, కోర్టు కేసులు, ఒకరి భూములు మరొకరిపై నమోదు కావడం, పెండింగ్‌మ్యుటేషన్ తదితరసమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. మిస్సింగ్ సర్వే నెంబర్లకు సంబంధించి 1393 దరఖాస్తులు, పెండింగ్ మ్యుటేషన్‌కు 295 దరఖాస్తులు, డీఎస్ పెండింగ్‌లో 404 దరఖాస్తులు వచ్చాయి. భూమి విస్తీర్ణం, చేర్పులు మార్పులు సంబంధించి 2093 దరఖాస్తులు వచ్చాయి. నిషేధిత జాబితాలో భూములు నమోదు అయినట్లు సవరించడానికి 270 దరఖాస్తులు వచ్చాయి. అసైన్డ్‌భూములు, భూసేకరణ, ఇతరరికార్డులకు సంబంధించిన సమస్యలపై 3489 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1675 సాదా బైనామాల సమస్యలపైనే దరఖాస్తులు వచ్చాయి. బోయిన్‌పల్లి మండలంలో 167, చందుర్తిలో 287, ఇల్లంతకుంటలో 200, గంభీరావుపేటలో 192, కోనరావుపేటలో 136, ముస్తాబాద్‌లో 306, సిరిసిల్లలో 13, తంగళ్ళపల్లిలో 75, వేములవాడలో 92, వేములవాడ రూరల్‌లో 82, వీర్నపల్లిలో 49, ఎల్లారెడ్డిపేటలో 76 దరఖాస్తులు వచ్చాయి.

సంక్షేమ పథకాలు దూరం...

సాదాబైనామాల క్రమబద్ధీకరణ దరఖాస్తులను పరిశీలించి పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో గత ప్రభుత్వం పెండింగ్‌లోనే పెట్టింది. కోర్టులో దాఖలైన పిటిషన్లకు గత ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతోనే పరిష్కారం లభించలేదు. దీంతో రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు దూరమయ్యారు. రైతు బంధు, రైతు బీమా, బ్యాంకు రుణాలు, రుణమాఫీ వంటి పథకాలను అందుకోలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రైతు బీమా, ఫసల్‌బీమా వంటివి అందించే దిశగానే సాదాబైనామాలను క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగానే ఆర్వోఆర్-2024 చట్టం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. దీంతో వేగంగా సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం అవుతాయని రైతులు ఎదురుచూస్తున్నారు.

'సర్దుబాటులో అవకతవకలను సరిచేయాలి'

కరీంనగర్ టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో జరిగిన అవకతవకలను వెంటనే సరిచేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు జంకె రామచంద్రారెడ్డి, వేల్పు బాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్ అర్కాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.